సాక్షి
జగిత్యాల
సోమవారం । 9 । డిసెంబర్ । 2024



గోదావరి తీరం.. భక్తజన సంద్రం

ధర్మపురి: ధర్మపురి గోదావరి భక్తజన సంద్రంగా మారింది. షష్టి మాసంలో భాగంగా ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దత్తాత్రేయ స్వామి ఆలయంలో నవరాత్రోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కోరుట్లలో సీపీఎం మూడో మహాసభ



ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కోరుట్ల: సీపీఎం జిల్లా మూడో మహాసభలను ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ముందుగా మహాప్రదర్శన చేపట్టారు. అనంతరం సినారే కళాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలిపారు. నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, శ్రీకాంత్, సుందర్, జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, చౌదరి, సులోచన, శారద, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో దత్తపారాయణం



పారాయణంలో సాయి భక్తులు

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీషిర్డిసాయి బాబా ఆలయంలో 108మంది భక్తులతో ఆదివారం దత్తపారాయణం ప్రారంభమైంది. భక్తిశ్రద్ధలతో సాగే ఈ దత్త పారాయణం వారం పాటు కొనసాగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ వేద పండితులు తిగుళ్ల విషుశర్మ, ఆలయ అర్చకులు వేణు మాధవాచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు సతీష్‌కుమార్, నాగుల కిషన్‌గౌడ్, మార కైలాసం, తవుటు రాంచంద్రం, లీనారెడ్డి, ఆత్మలీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న దీక్షాపరులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలో అయ్యప్పస్వామి పడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామశివారులో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేశారు. ఉదయం వేళ అయ్యప్పదీక్షాపరులు ఊరేగించారు. మండపం వద్ద అయ్యప్పస్వామి పేరిట పూజలు, భజనలు చేశారు. అయ్యప్పస్వామి నామస్మరణతో మార్మోగింది. అయ్యప్పదీక్షాపరులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న బోనగిరి దేవయ్య

జగిత్యాలటౌన్: పెండింగ్‌లో ఉన్న బిల్లులతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. తమ అత్యవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్ మొత్తం సమయానికి అందడం లేదన్నారు. సంపాదిత సెలవుల మొత్తం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సప్లిమెంటరీ వేతనాల బిల్లులు విడుదలచేయడంతో పాటు పీఆర్సీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అయిల్నేని నరేందర్‌రావు, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, జీవీ.రామకృష్ణ, మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: మండలంలోని వీరాపూర్, ఇటిక్యాల, ఒడ్డెలింగాపూర్, తాట్లవాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేశం ఆదివారం తెలిపారు.

ఆగని మోసం.. కావాలి చైతన్యం

- పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నా నిత్యం ఏదోచోట ఘటనలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 1,251 సైబర్ కేసులు
- ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు 1930, డయల్ 100



జగిత్యాలక్రైం: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు అదే తీరులో మోసాలు పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రజలు, వ్యాపారులు ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నా.. సైబర్ నేరగాళ్లు అంతకుపదింతలు టెక్నాలజీతో బురిడీ కొట్టిస్తున్నారు. పలు రకాల ఆర్థిక లావాదేవీలపై కన్నేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సైబర్ నేరాలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. స్థానిక పోలీసులు కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

జనవరి నుంచి 1251 సైబర్ నేరాలు

జిల్లాలో 2022లో 635 సైబర్ నేరాలు జరిగాయి. ఇందులో బాధితులు రూ.1,92,65,117 కోల్పోయారు. పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయడంతో సైబర్ నేరగాళ్ల ఖాతాలను స్తంభింపజేసి 158 కేసుల్లో రూ.17,17,299 రికవరీ చేశారు. 2023లో 866 కేసుల్లో రూ.8,61,05,027 బాధితులు కోల్పోగా.. పోలీసులు 123 కేసుల్లో రూ.5,07,31,989 రికవరీ చేయగలిగారు. 2024లో జనవరి నుంచి ఇప్పటివరకు 1251 కేసులు కాగా.. ఇందులో ఫైనాన్షియల్ కేసులు 1043, నాన్‌ఫైనాన్స్ కేసులు 208 ఉన్నాయి. ఇందులో రూ.1,27,07,500 బాధితులు కోల్పోగా.. రూ.1,12,40,544 రికవరీ చేశారు.

టోల్‌ఫ్రీ 1930, 100 ఏర్పాటు

ఎవరైనా బాధితులు సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 పాటు 100కు డయల్ చేస్తే తక్షణమే పోలీసులు సైబర్ నేరస్తుల ఖాతాలను గుర్తించి రిజర్వ్ బ్యాంక్ సహాయంతో వారి ఖాతాలను స్తంభింపజేస్తారు. సైబర్ నేరగాళ్ల ఖాతాలో జమ అయిన డబ్బును రికవరీ చేసే అవకాశం ఉంటుంది. సైబర్ నేరాలకు గురైన వారు సత్వరమే ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆర్థిక లావాదేవీలను నిలిపివేసి బాధితులకు న్యాయం చేస్తున్నారు.

ఆర్థికపరమైన సైబర్‌నేరాలు

సైబర్ నేరగాళ్లు పెద్ద ఎత్తున ఆర్థికపరమైన నేరాలకే పాల్పడుతున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు ఓటీపీ ఫ్రాడింగ్ కేసులే ఎక్కువగా జరుగుతున్నాయి. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, లక్కీ లాటరీ గెలుచుకున్నారని సెల్‌ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ చెప్పడం ద్వారా సైబర్ నేరస్తులు తమ ఖాతాల్లోని డబ్బును ఓటీపీ సహాయంతో ఖాతాలోకి మళ్లించుకుంటున్నారు. ఫేస్‌బుక్‌లో ప్రొఫైల్ ఫొటోను మార్చి స్నేహితులు, కష్టమర్ల నుంచి అత్యవసరంగా డబ్బు అవసరముందని రిక్వెస్ట్‌లు చేస్తూ మోసగిస్తున్నారు. ఏపీకే ఫైల్స్, లింక్‌లు, పీఎం కిసాన్, కుటుంబ సమగ్ర సర్వే పేరుతో లింక్‌లు పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. కొంతమంది వినియోగదారులకు క్యాష్‌బ్యాక్ లేదా రుణాలు అందజేస్తామని యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పి అందినంతా దోచుకుంటున్నారు.

యాప్‌ల ద్వారా మోసం

సాంకేతిక రంగంలో ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్ వాడకం ఉండటంతో వారికున్న బ్యాంక్ ఖాతాలను వ్యక్తిగత సమాచారాన్ని ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లోనే భద్రపర్చుకుంటున్నారు. దీంతో చాలా మంది సైబర్ నేరగాళ్ల సెల్‌ఫోన్లకు యాప్‌లు పంపించి డౌన్‌లోడ్ చేసుకుంటే క్యాష్‌బ్యాక్ వస్తుందని నమ్మించి యాప్ డౌన్‌లోడ్ కాగానే వారి వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు.

నేరగాళ్ల చేతికి జిల్లా వాసుల ఖాతాలు

కొంతమంది సైబర్ నేరగాళ్లు పట్టణాల్లో ఉన్న కొంతమందిని మచ్చిక చేసుకుని నిరుపేదలు, ఆర్థిక పరిస్థితి లేని వారిని గుర్తించి వారికి ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాలు ఇప్పించి వారికి తెలియకుండానే సైబర్ నేరగాళ్లు డబ్బులను వారి ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. జిల్లాలో సుమారు 10 మంది వ్యక్తులు తమ బ్యాంక్ ఖాతాల్లో డబ్బు పడటంతో వారిపై ఇతర రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. వారిని ఇటీవలే అక్కడి పోలీసులు వారిని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

సైబర్ కేసులు

2022	635
2023	866
2024 (ఇప్పటి వరకు)	1251

సైబర్ నేరాలపై విస్తృత అవగాహన

సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతుండటంతో ప్రభుత్వం, పోలీసు శాఖ సైబర్ నేరాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో, పాఠశాలలు, కళాశాలలతో పాటు, గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సైబర్‌నేరాలు జరుగుతున్న తీరు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరాలకు గురైన వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేస్తే సత్వరమే డబ్బును రికవరీ చేయడంతో పాటు సైబర్ నేరగాళ్లను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే న్యాయం



సైబర్ నేరాలకు గురైన బాధితులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 1930 లేదా 100 నంబర్లకు సత్వరమే ఫిర్యాదు చేస్తే పోలీసు శాఖ రిజర్వ్‌బ్యాంక్ సహాయంతో సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాను నిలిపివేసి డబ్బు రికవరీ చేసే అవకాశం ఉంటుంది. బాధితులు ఎలాంటి భయాందోళన లేకుండా నేరుగా ఫిర్యాదు చేయాలి. అగంతకుల ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లు ఓపెన్ చేసి ఇబ్బందులకు గురికావద్దు.

– అశోక్‌కుమార్, ఎస్పీ



మల్లెగుట్టపై భక్తుల సందడి

మల్లెగుట్టపై పట్నాల సందడి



మల్లికార్జున స్వామి సన్నిధిలో పట్నాలు వేస్తున్న భక్తులు

మల్యాల:మండల కేంద్రంలోని మల్లెగుట్ట మల్లికార్జునస్వామిని భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహికంగా పట్నాలు వేశారు. శివసత్తుల పూనకాలతో, ఒగ్గు పూజారుల ఒగ్గుడోలు చప్పుళ్లతో మల్లెగుట్ట మార్మోగింది. స్వామివారి ఆలయ పరిసరాల్లో వందలాది మంది భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు.

రైతుబిడ్డగా తెలంగాణతల్లి విగ్రహం

- రుణమాఫీపై బాధ్యతను కేంద్రం విస్మరిస్తోంది
- రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రుణమాఫీ విషయంలో కేంద్ర తన బాధ్యతను విస్మరించడంతో రాష్ట్రంపై భారం పడుతోందని, రైతుల సంక్షేమంపై కేంద్రానికి బాధ్యత లేదా అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యూపీఏ హయాంలో దేశవ్యాప్తంగా రుణమాఫీ చేస్తే.. తాజాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రుణమాఫీ బాధ్యతల నుంచి తప్పుకోవడం శోచనీయమని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో బీఆర్ఎస్ విమర్శలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. తెలంగాణతల్లి చేయి హస్తంగుర్తును చూపించేలా ఉందన్న బీఆర్ఎస్ విమర్శలను తప్పు పట్టారు. తెలంగాణతల్లి రవిక ఆరెంజ్, చీర ఆకుపచ్చ రంగులో ఉందని, అంతమాత్రానా అది బీజేపీ చిహ్నమా..? అని ప్రశ్నించారు. విగ్రహం పూర్తిగా రైతుబిడ్డను పోలి ఉందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాన్ని జగిత్యాలకు మంజూరు చేసేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, కల్లెపెల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్, ధర రమేష్, గుండ మధు, బీరం రాజేశ్ తదితరులు ఉన్నారు.

జిల్లాకు ఎస్‌డీఎఫ్ నిధులు

- నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయింపు
- విద్య, తాగునీటి సమస్యలకు పెద్దపీట

జగిత్యాల: జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) రూ.30 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాలు ఉండగా.. ఒక్కో నియోజకవర్గంలో రూ.10 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నిధులకు సంబంధించి ఏయే పనులు చేపట్టాలో ఎమ్మెల్యేలు అధికారులకు ప్రతిపాదనలు ఇస్తే ప్రణాళిక రూపొందించి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదిస్తారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉత్తమకుమార్‌రెడ్డి ఉన్నారు. ఆయన ఆదేశాల మేరకు ఈ నిధులు కేటాయించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఈ నిధులు మంజూరైనప్పటికీ విడుదల కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవే నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల, కోరుట్లలో బీఆర్ఎస్ నుంచి ఇద్దరు సంజయ్‌లు గెలిచారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇటీవలే సీఎం సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇక ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఒక్కరే (కోరుట్ల) ఉన్నప్పటికీ ఆయన నియోజకవర్గానికి నిధులు కేటాయించాల్సి ఉంటుంది.

విద్య, తాగునీటి రంగాలకు పెద్దపీట

ఈ నిధులను ప్రభుత్వం విద్య, తాగునీటి రంగాలకు ఖర్చు చేయాల్సి ఉంటుందని సూచించింది. ఒక్కో నియోజకవర్గానికి కేటాయించిన రూ.10 కోట్లలో దాదాపు రూ.2 కోట్లు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, టాయిలెట్స్, ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వెచ్చించాల్సి ఉంటుంది. మిగతా నిధులు తాగునీటి సమస్యతోపాటు, ఇతర పనులకు కేటాయించనున్నారు. జిల్లా యంత్రాంగం సూచించిన పనులనూ పరిశీలిస్తారు. ఈ నిధులను ప్రతి నియోజకవర్గంలో కొత్తగా చేపట్టే పనులకు మాత్రమే ఈ నిధులను కేటాయిస్తారు. జిల్లాలోని వేములవాడ నియోజకవర్గం పరిధిలో ఉన్న మేడిపల్లి, బీమారం, కథలాపూర్, చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో కొత్తగా చేపట్టబోయే పనులకు మాత్రమే నిధులు కేటాయించనున్నారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి

జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధులు కేటాయించడంతో అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ముఖ్యంగా పాఠశాలల్లో వసతులు లేవు, కొన్నిచోట్ల మరుగుదొడ్లు లేవు, అదనపు తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నిధులు ముఖ్యంగా వీటికే కేటాయించారు. కొన్నిచోట్ల మంచినీటి వసతులు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ సైతం మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ఈ నిధులను కేటాయించనున్నారు.

ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు

ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులను ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయించింది. పనుల ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. త్వరలోనే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులు చేపడతాం.

– మల్లేశం, ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళిక అధికారి

యాదవులు చైతన్యం కావాలి

ఇబ్రహీంపట్నం: యాదవుల చైతన్యం అఖిల భారతయాదవ మహాసభతోనే సాధ్యమని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యూత్ అధ్యక్షుడు రెబ్బాటి రాజశేఖర్‌యాదవ్ అన్నారు. మండలంలోని కొమటికొండాపూర్‌లో ఆదివారం మాట్లాడారు. కొందరు సంఘం పేరిట డబ్బులు వసూలు చేస్తూ.. వారి స్వార్థం కోసం వినియోగించుకుంటున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని సూచించారు. మహాసభకు రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలతో దేశం నలుమూలలు విస్తరించిన ఏకైక సంఘమన్నారు. కార్యక్రమంలో నాయకులు రెబ్బసి మధు, రాజేశ్వర్, సాగర్, అశోక్, వినయ్, రామ్, వంశీ, రంజిత్ పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు రూ.20వేల కోట్ల రుణమాఫీ చేశామని, నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అలాగే రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల భవనం నిర్మాణమవుతోందన్నారు. రోడ్డు ప్రమాదాల బారినపడినవారి కోసం రూ.14 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు, మాజీ సర్పంచ్‌లు మహేశ్వర్ రావు, అంకతి గంగాధర్, మాజీ ఎంపీటీసీ పరుశురాం గౌడ్, ఎంపీఓ రవిబాబు, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

భక్తజన మల్లన్న జాతర



బోనాలతో గుడిచుట్టు ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



బారికేడ్లలో మల్లన్నభక్తులు

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతర ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఒగ్గు కళాకారుల ఢమరుక వాయిద్యాల మధ్య పట్నాలు వేశారు. బెల్లం (బంగారం)తో తూకం వేశారు. అర్చకులు కొల్లూరి రాజేందర్, రఘునందన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. పోలీసు బృందాలు బందోబస్తు చేపట్టాయి. టికెట్ల ద్వారా రూ.72వేల ఆదాయం సమకూరినట్లు ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య, నిర్వహణ అధికారి విక్రమ్ తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బీమ సంతోష్, మాజీ సర్పంచ్ సిద్దంకి నర్సయ్య, మాజీ ఎంపీటీసీ గోస్కుల రాజన్న, విద్యాకమిటీ చైర్మన్ సిద్దంకి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ ఎప్పుడిస్తరో..

- అంగన్‌వాడీ చిన్నారులకు అందజేసేందుకు ప్రభుత్వ నిర్ణయం
- సిద్ధంగా ఉన్నా పంపిణీలో జాప్యం
- నెలల తరబడి ఆలస్యంపై విమర్శలు



కథలాపూర్ మండలం దూలూర్ అంగన్‌వాడీ కేంద్రంలో విభిన్న రంగుల డ్రెస్సుల్లో చిన్నారులు

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యూనిఫామ్స్ మాదిరిగానే ఈ ఏడాది అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫామ్స్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల విద్యార్థులకు మాత్రం విద్యాసంవత్సరం ఆరంభంలోనే పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రం అందజేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

మహిళాసంఘాలకు అప్పగింత

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్‌ను కుట్టే బాధ్యతలను మహిళ సంఘాలకు అప్పగిస్తే సకాలంలో విద్యార్థులకు అందించారని ప్రభుత్వం కితాబు ఇచ్చింది. ఈ క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను డీఆర్డీవో పరిధిలోని మహిళ సంఘాలకు అప్పగించారు. వారు కుట్టి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించినట్లు తెలిసింది. చిన్నారులకు అందించాల్సిన యూనిఫామ్స్ ప్రభుత్వ కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయని సమాచారం.

1,065 కేంద్రాలు.. 46,311 మంది చిన్నారులు

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా, వీటి పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 7 నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 46,311 మంది ఉన్నారు. వీరికి యూనిఫామ్స్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఆగస్ట్ 15న పంపిణీ చేస్తామని ప్రకటించి వాయిదా వేశారు. మళ్లీ ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కేంద్రాల్లోని చిన్నారుల యూనిఫామ్స్ పంపిణీ గురించి పట్టించుకునేవారు లేరని విద్యాభిమానులు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి యూనిఫామ్స్ అందించాలని వారి తల్లిదండ్రులు, విద్యాభిమానులు కోరుతున్నారు.

త్వరగా అందజేయాలి



చిన్నారుల కోసం కుట్టించిన యూనిఫామ్స్‌ను నెలల తరబడి పంపిణీ చేయకపోవడం దారుణం. నెలలు గడిచే కొద్ది చిన్నారులు ఎత్తు పెరిగితే ఇప్పుడు కుట్టించిన యూనిఫామ్స్ చిన్న సైజుగా మారుతాయి. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలి. త్వరగా యూనిఫామ్స్ పంపిణీ చేయాలి.

– దొప్పల జలంధర్, పాఠశాల యాజమాన్య కమిటీ మాజీ చైర్మన్, సిరికొండ

ఆదేశాలు రాగానే పంపిణీ చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫామ్స్ పంపిణీ అనేది ప్రభుత్వం నిర్ణయం మేరకు ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అందిస్తాం. ప్రస్తుతం కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నాం.

– నరేశ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి

క్లుప్తంగా

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ భర్త మృతి


గణేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ భర్త జవ్వాజి గణేశ్(48) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గణేశ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కాగా, మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు.

గుండెపోటుతో బుగ్గారం ఎంపీడీవో..


శ్రీనివాస్ (ఫైల్)

బుగ్గారం(ధర్మపురి): జగిత్యాల జిల్లా బుగ్గారం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్(60) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం ఎప్పటిలాగే విధులకు హాజరై అనంతరం కరీంనగర్‌లోని తన నివాసానికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో ఛాతీలో నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు తెలుపగానే వారు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు తోటి ఉద్యోగులు పేర్కొన్నారు. కాగా, గుండెపోటుతో అకాల మరణం చెందిన ఎంపీడీవో శ్రీనివాస్‌ను కడసారి చూసేందుకు మండలానికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు కరీంనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బుగ్గారం మాజీ జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, నాయకులు వేముల సుభాష్, నగునూరి నర్సాగౌడ్, నగునూరి రాజశేఖర్, సమీద్, జంగ శ్రీనివాస్, ఎంపీవో అఫ్జల్‌మియా, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మహమ్మద్ షమీమ్(ఫైల్)

సిరిసిల్లక్రైం: తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షమీమ్ (46) అప్పుల బాధ భరించలేక ఆదివారం సిరిసిల్ల మానేరు వాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాలు.. మహమ్మద్ షమీమ్ కుటుంబ పోషణ నిమిత్తం టైలరింగ్ పని చేసేవాడు. ఇటీవల తన పెద్ద కుమార్తె వివాహం చేయగా అప్పులయ్యాయి. చిన్న కూతురు వివాహం ఎలా చేయాలనే దిగులుతో పాటు ఇప్పటికీ చేసిన అప్పులు పెరగడంతో అవి తీర్చే దారిలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు తెలిపారు.





తరలివచ్చి.. మొక్కులు చెల్లించి

వేములవాడ: రాజన్నను ఆదివారం సుమారు 35 వేల మంది దర్శించుకున్నారు. సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

విద్యానగర్(కరీంనగర్): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా శాఖ ఎన్నికలు ఈనెల 11న జరగనున్న నేపథ్యంలో ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో వివిధ పదవులకు పోటీ చేసేందుకు 99 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష స్థానానికి ఏడుగురు, కార్యదర్శి స్థానానికి ఏడుగురు, 3 ఉపాధ్యక్ష స్థానాలకు 17 మంది, 3 సహాయ కార్యదర్శి స్థానాలకు 18 మంది, కోశాధికారి స్థానానికి ఐదుగురు, జిల్లా కార్యవర్గ సభ్యులు 16 స్థానాలకు 45 నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బుర్ర సంపత్‌కుమార్ మాట్లాడుతూ, నామినేషన్ల పర్వం ముగిసిందని, 9న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికకు సంబంధించి అన్ని పదవులకు ఏకగ్రీవం కాకుంటే 11న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎల్ఎండీలోని శ్రీతాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఫంక్షన్ హాల్‌లో పోలింగ్ నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియను ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు, జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ నగునూరి శేఖర్ పర్యవేక్షించగా, ఎన్నికల సహాయ అధికారులుగా ఎలగందుల రవీందర్, దూలూరి జగన్మోహన్ వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి పరీక్షల పరిశీలకుడిగా ఓదెలు కుమార్


ఓదెలు కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థి విజ్ఞాన్ మంతన్ టాలెంట్ టెస్ట్ పరీక్షల రాష్ట్రస్థాయి పరిశీలకుడిగా ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. గత నెల 23, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంతన్ టాలెంట్ పరీక్షకు రాష్ట్రంలోని 128 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 25న నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, ఘట్ కేసర్ హైదరాబాద్‌లో ప్రయోగ పరీక్షలు నిర్వహించి 10 మంది విద్యార్థులను జాతీయస్థాయికి ఎంపిక చేయనున్నారు. ప్రయోగ పరీక్షకు పరిశీలకుడిగా చిగురుమామిడి మండలం, ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు బి.ఓదెలు కుమార్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా అతడిని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్ రావు, డీసీఈబీ కార్యదర్శి స్వదేశ్‌కుమార్, అశోక్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.జయప్రద, ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది 108 ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలుపడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ఆయుధాలు

- యువత చేతుల్లోకి మారణాయుధాలు
- పెళ్లి బరాత్‌లు, బర్త్‌డే వేడుకల్లో హంగామా

'పది రోజుల క్రితం జగిత్యాల జిల్లా సరిహద్దు గ్రామంలో ఓ యువకుడు మద్యం మత్తులో తల్వార్ పట్టుకుని హంగామా సృష్టించగా గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు పెట్టారు'.

'జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని గోదావరినది సమీపంలో ఓ యువకుడు జన్మదిన వేడుకల్లో ఆయుధంతో కేక్ కట్‌చేసిన వీడియో ఇటీవల వైరల్‌గా మారింది'.


ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టిన ఆయుధం

జగిత్యాలక్రైం: యువకులు తమ భవిష్యత్‌ను ఎంచుకునే వయస్సులో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆయుధాలు కొనుగోలు చేస్తూ హంగామా సృష్టిస్తున్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో గొడవలకు పాల్పడి కక్షలు పెంచుకుని ప్రత్యర్థులపై దాడులు చేసేందుకు గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో ఆయుధాలు తెప్పించుకుని వెంట పెట్టుకుని తిరుగుతున్నారు. మద్యం మత్తులో ఉన్న సమయంలో జనసంచారం ఉన్న చోట ఆయుధాన్ని తీసి హంగామా సృష్టించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిఘా కరువు

ఏడాది కాలంగా జగిత్యాల జిల్లాలో చాలా మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా తమకు అవసరమైన వస్తువులు తెప్పించుకోవడంతోపాటు గుట్టుచప్పుడు కాకుండా మారణాయుధాలను కూడా కొనుగోలు చేస్తున్నారు. వీటిపై నిఘా కరువవడంతో ఇష్టారీతిన తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆయుధాలను కుటుంబ సభ్యులకు తెలియకుండా రహస్య ప్రాంతంలో దాచిపెడుతూ, గొడవల సమయంలో వాటిని బయటకు తీస్తుండడం ఆందోళనకర పరిణామం.

బర్త్ డేలు, పెళ్లి వేడుకల్లో..

జిల్లాలో చాలా మంది యువకులు బర్త్ డే, పెళ్లి వేడుకల్లో మారణాయుధాలతో డ్యాన్స్‌లు చేయడంతో పాటు తల్వార్‌లు తిప్పుతూ హంగామా సృష్టించిన ఘటనలు ఉన్నాయి. కొంత మంది యువకులు ఆన్‌లైన్ ద్వారా డమ్మీ తుపాకులు, తల్వార్‌లు, కత్తులు, కీచైన్ రూపంలో ఉన్న మారణాయుధాలు ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్ గద్దె కూల్చివేత


ధ్వంసమైన బీఆర్‌ఎస్ గద్దె

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్‌ఎస్ గద్దెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఈ ఘటనపై ఆపార్టీ మండల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దె కూల్చినవారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజేశ్వర్‌రావునగర్‌లో బీఆర్‌ఎస్ గద్దె నిర్మించి దానిపై కారును సింబల్‌గా పెట్టారు. ఇటీవల ఓ అధికారి గద్దెపై ఉన్న కారును తొలగించాలని చెబితే తాము క్రమశిక్షణ గల కార్యకర్తలుగా కారును తొలగించామని చెప్పారు. కానీ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు గద్దెను కూల్చివేశారని ఆగ్రహించారు. దీని వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నాయకులు కమ్మరి రాజారాం, పిట్ల బాబు, కొమిరిశెట్టి లక్ష్మణ్, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్స్‌కు సీనియర్స్ మహిళల కబడ్డీ జట్టు


ప్రీ క్వార్టర్స్‌కు చేరిన జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలోని ఫతేమైదాన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు క్రీడాకారిణులు సత్తా చాటారు. ఈ నెల 7న పోటీలు ప్రారంభం కాగా ఆదివారం పోటీలు ముగిసేసరికి జిల్లా జట్టు ప్రీ క్వార్టర్స్‌కు చేరింది. పూల్ సీ లో ఉన్న జిల్లా జట్టు మేడ్చల్, ఆసిఫాబాద్ జట్లపై అద్భుత విజయాలను నమోదు చేసింది. జట్టు విజయం పట్ల జిల్లా కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.సంపత్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌రావు, మల్లేశ్‌గౌడ్, కోచ్ పద్మ హర్షం వ్యక్తం చేశారు.

కొడుకును కాపాడబోయి తండ్రి మృతి

- విద్యుదాఘాతంతో దుర్మరణం


రాజమౌళి (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): విద్యుత్ షాక్‌కు గురైన కొడుకును కాపాడబోయి తండ్రి మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పిట్టల రాజమౌళి (37) ఆటో నడుపుకుంటూ జీవిస్తాడు. అతడి నాన్నమ్మ మూడురోజుల క్రితం మృతిచెందింది. ఆదివారం మూడురోజుల కార్యక్రమం నిర్వహించి కుటుంబ సభ్యులందరూ స్నానాల కోసం దగ్గర లోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తుండగా రాజమౌళి కొడుకు రిశ్వంత్‌కు కరెంట్ మోటార్ పైప్ ద్వారా ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కొడుకును కాపాడబోయి రాజమౌళి షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మోటార్ ఫ్యూజులు తీసివేసి తీవ్రగాయాలపాలైన తండ్రి కొడుకులను కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే రాజమౌళి మృతిచెందినట్లు తెలిపారు. రిశ్వంత్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

- 60 శాతం కాలిన గాయాలతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి


విద్యుత్ టవర్‌పై తిరుపతి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన రేగుల తిరుపతి రైల్వేట్రాక్‌పై హైటెన్షన్ విద్యుత్ తీగ పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎన్టీపీసీ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాజన్ అనే యువతి ఉపాధి కోసం గోదావరిఖని ప్రాంతానికి వలస వచ్చింది. గోదావరిఖనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రేగుల తిరుపతికి ఆమె పరిచయమైంది. వీరిద్దరూ 2008లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే, మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. దీంతో తిరుపతి అప్పట్లో రెండుసార్లు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. భార్యాభర్తలను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అయినా, ఎవరిలోనూ మార్పురాలేదు. ఈక్రమంలో ఆదివారం ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన తిరుపతి సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లాడు. అక్కడి టవర్ ఎక్కి విద్యుత్ తీగను చేతులతో పట్టుకున్నాడు. హైటెన్షన్ విద్యుత్ కావడంతో ఒక్కసారిగా మంటలు లేచి ఫ్యూజ్ కొట్టేసి సరఫరా నిలిచిపోయింది. ఈప్రమాదంలో తిరుపతి శరీరం సుమారు 60శాతం వరకు కాలిపోయింది. టవర్ మధ్య కాసారంలో తల ఇరుక్కుని విలవిల్లాడుతుండగా.. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని తిరుపతిని కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం బాధితుడు కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎస్సై ఉదయ్ కిరణ్ ఘటనపై విచారణ చేస్తున్నారు.

పోస్టుమార్టం కోసం మృతదేహం వెలికితీత

ముత్తారం(మంథని): ముత్తారం మండలం లక్కారంలో నవంబర్ 5న వేల్పుల కొమురమ్మ(75) చనిపోగా అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా తన తల్లిని ఇంటిపక్కన ఉండేవారు దూషించడంతో మనోవేదనకు గురై గుండెపోటుతో చనిపోయిందని మృతురాలి కొడుకు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై నరేశ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం తహసీల్దార్ సుమన్ ఆధ్వర్యంలో కొమురమ్మ మృతదేహాన్ని సమాధి నుంచి వెలికి తీయించగా, వైద్యుడు పోస్టుమార్టం చేశారు. శవపరీక్షల నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని, కేస్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థికి తీవ్రగాయాలు

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి తేలు మణిదీప్ ఆదివారం సాయంత్రం విద్యుత్‌షాక్ తగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాలు.. తేలు రాజేశం–లక్ష్మి దంపతుల కుమారుడు మణిదీప్ తన స్నేహితులతో కలిసి సాయంత్రం షటిల్ ఆడేందుకు వెళ్లాడు. అందుకోసం విద్యుత్ లైట్లు అమర్చారు. విద్యుత్ సరఫరా కోసం పైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తీగలు తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలు కావటంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించినట్లు తెలిసింది.

ప్రమాద రహిత సింగరేణి లక్ష్యం

- నేటినుంచి బొగ్గు గనులపై రక్షణ పోటీలు

జీడీకే–7ఎల్ఈపీ గని ఇన్‌చార్జి మేనేజర్ ఇటీవల ఇసుక బంకర్‌లో పడి మృతిచెందారు. ఈ ప్రమాదం నివారించతగినదే. అయినా, తొందరపాటుతో నిండు ప్రాణం గాల్లో కలిసిందని అధికారులు వివరిస్తున్నారు.

జీడీకే–11గనిలో ఇటీవల ఎల్‌హెచ్‌డీ యంత్రాన్ని పార్క్ చేస్తుండగా.. దాని బకెట్ కిందకు జారిపడి ఆపరేటర్ మృతిచెందాడు. బకెట్‌ను కిందకు దింపిఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదంటున్నారు.

మందమర్రి వర్క్‌షాప్‌లో ఇటీవల ఐరన్ పట్టీలు క్రేన్‌తో వాహనంలో లోడ్ చేస్తుండగా రూఫ్‌వైర్ తెగిపడి కార్మికుడు మృతిచెందాడు. సరైన రూఫ్‌వైర్ వినియోగించినా, కార్మికుడు కొంతదూరంలో ఉన్నా ఈ ప్రమాదాన్ని నివారించే వీలుందని పేర్కొంటున్నారు.


ముస్తాబైన ఓసీపీ క్వారీలోకి వెళ్లే హాలేజీ ప్రధాన రోడ్డు

సింగరేణిలో గత ఏడేళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	మృతులు	తీవ్ర గాయాలు	సాధారణ గాయాలు
2018	7	191	347
2019	8	138	217
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024	06	84	72

గోదావరిఖని(రామగుండం): ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా యాజమాన్యం సోమవారం నుంచి ఈనెల 21 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. సంస్థలో ఈఏడాది ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు ఉద్యోగులు మృతిచెందగా, గతేడాది జరిగిన ఐదు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోయారు. ఇవన్నీ నివారించగలిగే ప్రమాదాలేనని, అవగాహన, రక్షణ చర్యలు, జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చని, ఈక్రమంలోనే రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణ చర్యలపైనా పూర్తిస్థాయిలో దృష్టి పెడుతోంది.

17 ఓసీపీలు.. 22 భూగర్భ గనులు

సింగరేణిలో 17 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు(ఓసీపీలు), 22 భూగర్భ గనులు ఉన్నాయి. వాటితోపాటు డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలపై పోటీలు నిర్వంచనున్నారు. ఇందుకోసం ఏర్పాటుచేసిన 12 ప్రత్యేక బృందాలు కార్పొరేట్, గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను తనిఖీ చేస్తాయి. డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ ఆదేశాల మేరకు వారం నుంచి 15రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ అంశంపై క్షుణ్ణంగా..

ప్రత్యేక బృందాలు రక్షణ ఓసీపీల్లో భారీ యంత్రాల కదలికలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, అగ్నిప్రమాదాలపై దృష్టి పెడతాయి. భూగర్భ గనుల్లో స్ట్రాటా కంట్రోల్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, రూఫ్, సైడ్ సపోర్టింగ్‌ను తనిఖీ చేస్తాయి. డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు, సిబ్బంది కదలికలు, పనిముట్ల తీరు పరిశీలిస్తాయి. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన గనులను ఉత్తమంగా ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తాయి.

నిశితంగా తనిఖీ



ఓసీపీలు, భూగర్భ గనులు, వివిధ డిపార్ట్‌మెంట్లలో రక్షణ చర్యలను ప్రత్యేక బృందాలు నిశితంగా తనిఖీ చేస్తాయి. రక్షణపై దృష్టి సారించాకే బొగ్గు ఉత్పత్తి తీయాలి. ఈవిషయంపై ప్రత్యేక బృందాలతో అధ్యయనం చేస్తాం. – శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

ఆత్మస్థైర్యానికి ప్రతిబింబం జూడో

- కరీంనగర్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు
- 27 నుంచి 30 వరకు నిర్వహణ
- 33 జిల్లాల నుంచి హాజరుకానున్న క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: చేతిలో ఎలాంటి ఆయుధం లేకున్నా ప్రత్యర్థుల దాడిని ఎదుర్కొంటూ, ఎదుటివారికి హాని కలగకుండా మట్టి కరిపించే యుద్ధ క్రీడ జూడో. పురాతన కాలంలోనే జూడో క్రీడకు క్రేజీ ఉండేదని వినికిడి. ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యానికి ప్రతిబింబంగా నిలిచే జూడో క్రీడను అందరూ నేర్చుకోవాలంటున్నారు శిక్షకులు. కాగా ఈ నెల 27 నుంచి 30 వరకు కరీంనగర్‌లో సీఎం కప్– 2024 రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగనున్నాయి. సీఎం కప్– 2024 పోటీల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రాష్ట్రస్థాయి పోటీలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) కేటాయించడం విశేషం.

2016లో జాతీయ పోటీలు

జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో 2016లో 62వ జాతీయస్థాయి పాఠశాలల అండర్–17 బాలబాలికల జూడో పోటీలకు జిల్లా ఆతిథ్యమిచ్చింది. అంతేకాకుండా సుమారు 20 సంవత్సరాలుగా ఏటా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు పాఠశాలలో రాష్ట్ర జూడో పోటీలు జరగడం విశేషం. గతేడాది క్రీడా పాఠశాలలో అండర్–17 రాష్ట్ర పోటీలు, కరీంనగర్‌లోని మానేరు పాఠశాలలో జూనియర్స్ విభాగంలో, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో సబ్ జూనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి.

33 జిల్లాల నుంచి..

తొలిసారిగా సీఎం కప్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు కరీంనగర్‌లో జరగనుండగా 33 జిల్లాల నుంచి సుమారు 594 మంది క్రీడాకారులు, 132 మంది కోచ్లు, మేనేజర్లు, 20 మంది రెఫరీలు హాజరుకానున్నారు. 12 నుంచి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల క్రీడాకారులకు జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. 2008 నుంచి 2012 మధ్య పుట్టిన వారు పోటీలకు అర్హులు.

నగదు బహుమతులు

సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు పారితోషికాలను ప్రభుత్వం ప్రకటించింది. బంగారు పతకానికి రూ.20 వేలు, రజత పతకానికి రూ.15 వేలు, కాంస్య పతకానికి రూ.10 వేలు ఇవ్వనున్నారు. కాగా జూనియర్స్ విభాగాల్లో 9 వెయిట్ కేటగిరీలో పోటీలు జరుగనుండగా మొత్తం రూ.9 లక్షల 90 వేల నగదు బహుమతులు క్రీడాకారులకు దక్కనున్నాయి.

బాలుర వెయిట్ కేటగిరీలు
30,35,40,45,50,55,60,66 కేజీల లోపు, 66 కేజీల పైన..

బాలికల వెయిట్ కేటగిరీలు
36,40,44,48,52,57,63,70 కేజీల లోపు, 70 కేజీలపైన..

కరీంనగర్‌కు కేటాయించడం సంతోషకరం



తెలంగాణలో కరీంనగర్ జిల్లా జూడో క్రీడకు పెట్టింది పేరు. కేవలం మానేరు విద్యాసంస్థలకు జూడో క్రీడకు సుమారు 20 ఏళ్ల అనుబంధం ఉంది. ఇప్పటి వరకు 15కు పైగా రాష్ట్ర పోటీలు ఒక సారి జాతీయస్థాయి పోటీలను అట్టహాసంగా నిర్వహించాం. సీఎం కప్ పోటీలను సైతం ఘనంగా అందరం కలిసి నిర్వహిస్తాం.
– కదారి అనంతరెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు, మానేరు విద్యాసంస్థల అధినేత

అట్టహాసంగా నిర్వహిస్తాం



జూడో పోటీల్లో పాల్గొనేందుకు 33 జిల్లాల నుంచి రానున్న క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉన్ని ఏర్పాట్లు చేస్తాం. అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.
– శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

పతకాలు సాధిస్తాం



జిల్లాలో జూడో క్రీడాకారులకు కొదువ లేదు. జాతీయస్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు ఉన్నారు. సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో సత్తాచాటి పతకాలు సాధిస్తారు.
– బి.సాయిరాంయాదవ్, క్రీడా పాఠశాల జూడో కోచ్, కరీంనగర్

అందరి సహకారంతో..



శాట్స్ అధికారులు కోరగానే జూడో క్రీడను కరీంనగర్‌కు కేటాయించడం సంతోషకరం. సీఎం కప్ పోటీలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో కలిసి విజయవంతం చేస్తాం.
– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి